# ప్రజలు గుణపాఠం చెప్పినా.. మోడీ వైఖరి మారలేదు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

వరంగల్ లో సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం



4లో..

వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 321 మంగళవారం | 09 జూలై 2024 | పేజీలు : 06 | వెల రూ. 5

# మొరం దందా..

## C/o. కాటారం





వివరాలు 2లో..

- అవి ఓపెన్ కాస్టులు కాదు.. మొరం అక్రమ దందాకు నిలువెత్తు సాక్ష్యాలు
- ధన్వాడ, శంకరపల్లి నుంచి యథేచ్ఛగా తరలింపు
- కూలిపోనున్న విద్యుత్ స్తంభాలు
- సమీపంలోని పొలాలకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మంథని శాసనసభ నియోజకవర్గ పరిధిలోని కాటారం మండలం ధన్వాడ, శంకరంపల్లి శివారు ప్రాంతాలు ఓపెన్ కాస్టులను తలపిస్తున్నాయి. ఎటు చూసినా తాటిచెట్టు లోతంత గొయ్యిలే దర్శనమిస్తున్నాయి. ఇక్కడినుంచి పెద్ద ఎత్తున మొరం, మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్లో మొరం, మట్టి తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోకుండా నిరంతరాయంగా మొరం దందా నిర్వహిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఈ నాసిరకం మొరంను సుమారు రూ.32 కోట్లతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం నుంచి మానేరు బ్రిడ్జి అడవి సోమనపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి పనులకు ఉపయోగించడం వివాదాలకు తావిస్తోంది. నాణ్యతతో కూడిన మొరంను వాడాల్సిన కాంట్రాక్టర్ ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే సదరు కాంట్రాక్టర్ కు స్థానిక రాజకీయ పెద్దల అండదండలు మెండుగా ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. - వరంగల్ వాయిస్, కాటారం



5లో..

# మార్క్ చూపిస్తా.. అభివృద్ధి బాట పట్టిస్తా..

మాస్టర్ ప్లాన్ అమలుకు కృషి

కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి

మారనున్న ఓరుగల్లు రూపు రేఖలు



కలెక్టర్‌ను కలిసిన కుడా చైర్మన్

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8 లో..

# వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు మంత్రి సీతక్క హామీ

# మొరం దందా..

## C/o. కాటారం

**అవి ఓపెన్ కాస్టులు కాదు.. మొరం అక్రమ దందాకు నిలువెత్తు సాక్ష్యాలు**

**ధన్వాడ, శంకరపల్లి నుంచి యథేచ్ఛగా తరలింపు**

**కూలిపోనున్న విద్యుత్ స్తంభాలు**

**సమీపంలోని పొలాలకు పొంచి ఉన్న ముప్పు**

**పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు**



**వరంగల్ వాయిస్, కాటారం :** మంథని నియోజకవర్గంలోని కాటారం నుంచి అడవి సోమనపల్లి వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధికాగా అడవి సోమనపల్లి నుంచి మంథని మీదుగా పెద్దపల్లి వరకు పెద్దపల్లి జిల్లా పరిధి ఉంది. కాగా అడవి సోమనపల్లి నుంచి మంథని మీదుగా నిర్మించిన రహదారి పీడీఆర్ కన్ స్ట్రక్షన్స్ సంస్థ పూర్తి చేసింది. ఈ నిర్మాణం నాణ్యతతోనే ఉందంటూ ప్రజలు, ప్రయాణికులు బాహటంగానే తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. కానీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం నుంచి అడవి సోమనపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి పనుల్లో నాణ్యత కొరవడిందని ప్రయాణికులు, బాటసారులు బాహటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రహదారి నిర్మాణానికి నాణ్యతతో కూడిన మొరం ఉపయోగించాల్సి ఉన్నప్పటికీ ఇసుక, దుబ్బ, బొంతు, లాంటి మట్టిని ఉపయోగించడం వల్ల నాణ్యత లేకుండా పోతుందని వాపోతున్నారు. చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకున్న చందంగా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో గుత్తేదారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం గమనార్హం. నాణ్యత కొరవడిందంటూ అధికార పార్టీ నాయకులే గగ్గోలు పెడుతున్న సంబంధిత గుత్తేదారు పట్టించుకోకపోవడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### అడ్డగోలుగా మొరం తవ్వకాలు..

నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్లో మొరం, మట్టి తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి నిబంధనలు లేకుండానే ఇక్కడి కాంట్రాక్టర్లు వ్య గుత్తి దారులు పాటించకపోవడం గమనార్హం. ఈ ప్రాంతంలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టర్ మండలంలోని కొంత భూమిని కొనుగోలు చేసినట్లు చూపించి అక్కడినుంచి రాత్రింబవళ్లు యథేచ్ఛగా మట్టి, మొరం తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న టిప్పర్లతో ప్రమాదాలు సంభవిస్తున్నా, స్థానికంగా ఇబ్బందులు నెలకొన్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత రోడ్డు మట్టిని తీసి మళ్ళీ అదే తారు, మట్టిని సైతం అక్కడే ఉపయోగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కరెంటు స్తంభాలకు పెనుముప్పు..

ధన్వాడ 279 సర్వే నెంబరు శివారు శంకరపల్లి భూముల నుంచి మొరం, మట్టి తవ్వకాలతో ఆ ప్రాంతం ఓపెన్ కాస్ట్ ను తలపిస్తోంది. లోతైన గుంతలు ఏర్పడడంతో చుట్టూ ఉన్న వ్యవసాయ భూముల యజమానులకు ఇబ్బందిగా మారుతోందని రైతాంగం గగ్గోలు పెడుతోంది. పశువులు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడే పరిస్థితి నెలకొన్నట్లుగా వారు వాపోయారు. విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయో అనే భయాందోళనలు నెలకొన్నాయి.

### ప్రభుత్వం చెప్పేదొకటి..

ప్రభుత్వం చెబుతున్న విషయానికి, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పొంతన లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని చెప్పే ప్రజాప్రతినిధులు తమ స్వార్థపూరితమైన నిర్ణయాలకు సాధారణ, సామాన్య ప్రజానీకం విల విల్లాడిపోతున్నారని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ అనుయాయులకు, అనుచరులు, కార్యకర్తలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్లనే ప్రభుత్వ అధికారులు ఏమి చేయలేకపోతున్నారని విపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. కాటారం నుంచి అడవి సోమనపల్లి వరకు నిర్మించనున్న రహదారి నిర్మాణానికి ఉపయోగించే మట్టి, మొరం ఎక్కడి నుంచి గుత్తేదారులు తీసుకొస్తున్నారు అనే విషయాన్ని అధికారులు గమనించకపోవడం ఇక్కడ సందర్భోచితం.

### నిబంధనలు చెల్లుబాటు కావు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొరం తవ్వకాల కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకొని ఎన్వోసీ పొందాలి. మైనింగ్ శాఖల అనుమతి తీసుకోవాలి. టన్నుకు రూ.20 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. 30 శాతం డీఎంఎఫ్టి, రెండు శాతం స్టేట్ మినరల్ ఎక్స్ ఫ్లొరేషన్ ట్రస్ట్ కు, రెండు శాతం ఆదాయ పన్నుకు చెల్లించాలి. కానీ ఇదంతా ఇక్కడ బేఖాతరు చేస్తూ గుత్తేదారులు లక్షల రూపాయల విలువైన మొరాన్ని, మట్టిని తరలిస్తూ సర్కారు ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా స్థలాన్ని సందర్శించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని నోటీసులు జారీ చేసినా.. గుత్తాదారులు పట్టించుకోనటువంటి పరిస్థితి ఇక్కడ నెలకొంది. శంకరంపల్లి, ధన్వాడ శివారులో గత కొంతకాలంగా నిరంతరాయంగా మట్టి, మోరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీలు రెండు పనిచేస్తున్నప్పటికీ అధికారులు వాటిని సీజ్ చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

### అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు :

**– నాగరాజు, తాసిల్దార్**

అనుమతి లేకుండా మట్టి, మొరం తవ్వకాలు చేపడుతున్నారనే విషయంలో ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిరినట్లయితే, వారిపై చట్టపరంగా చర్యలు చేపడతాం. ఓపెన్ కాస్ట్ ను తలపించే విధంగా మొరం, మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయాన్ని విలేకరులు తాసిల్దార్ నాగరాజుకు దృష్టికి ఫొటోలు, వీడియోల ద్వారా తీసుకెళ్లగా.. వెంటనే మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ వెంకన్నను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలంటూ ఆదేశించారు. రాజకీయ ఒత్తిళ్లు లేవన్నారు. గుత్తేదారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదు. ఈ విషయంలో అవసరమైతే పోలీసు యంత్రాంగాన్ని, మైనింగ్ శాఖ అధికారుల సహకారాన్ని తీసుకుంటాం.





# ఘనంగా 76వ జాతీయ విద్యార్థి దినోత్సవం

## ఆకట్టుకున్న శోభ యాత్ర

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో సుమారు ఐదు వేల మంది విద్యార్థులతో శోభ యాత్ర నిర్వహించారు. బీమారం ఎస్ వీఎస్ కళాశాల నుంచి ప్రారంభమైన యాత్ర నయీమ్ నగర్, సీఎంఆర్ షాపింగ్ మాల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ కార్య సమితి సభ్యులు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జూలై 9, 1949న ప్రారంభించి, ఆనాటి నుంచి విద్యార్థులకు జాతీయ భావాలు నేర్పుతూ జాతీయ పునర్నిర్మానం కోసం పరితపించే ఏకైక సంఘం ఏబీవీపీ అన్నారు. నేషన్ ఫస్ట్.. సెల్ఫ్ నెక్స్ట్ అనే స్లోగన్ తో ముందుకు వెళ్తూ ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులలో నైపుణ్యం పెంచేందుకు ఎన్నెన్నో కార్యక్రమాలు ముందుకు తీసుకొస్తున్న ఏకైక సంస్థ విద్యార్థి పరిషత్ అని వివరించారు. అదేవిధంగా 42 మంది విద్యార్థి పరిషత్ కార్యకర్తలు అమరులైనా కూడా క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ సాగే విధంగా కళాశాలల నుంచి విశ్వవిద్యాలయంలో విద్యారంగ సమస్యను పరిష్కారంకై ముందుండి పోరాడే విద్యార్థి పరిషత్ అని ఏబీవీపీని చెప్పుకోవచ్చన్నారు. విద్యార్థి శక్తి జాతీయ శక్తి అనే విధానంతో ముందుకు పోతున్న విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. భారతదేశాన్ని విశ్వ గురువుగా ముందుకు తీసుకెళ్లడానికి ఏబీవీపీ పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపెల్లి సుజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్, ప్రణయ్, జోనల్ ఇంచార్జిలు మనోజ్, హరి చరణ్, కార్యాలయ కార్యదర్శి భరత్, యశ్వంత్, రోహిత్, ప్రథ్యం, అభిరామ్, శ్రవణ్ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.







## నాలుగో రోజుకు చేరిన శాకంభరి ఉత్సవాలు

వరంగల్ మహా నగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరి నవరాత్ర మహోత్సవాలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారి దశ మహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి ఉదయం కురుకల్లా, షోడశ క్రమాన్ని అనుసరించి సాయంత్రం భీరుండా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. - వరంగల్ వాయిస్, వరంగల్

## పేకాట రాయుళ్ల అరెస్ట్



**వరంగల్ వాయిస్, మడికొండ :** టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ఆదేశాల మేరకు మంగళవారం దాడులు నిర్వహించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయోధ్యపురం గ్రామంలోని బహిరంగ ప్రదేశం, ఔట్ స్కర్ట్స్‌లో ప్లే కార్డులు ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,340 నగదు, ఆరు స్మార్ట్ ఫోన్‌లు, ప్లే కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మడికొండ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.రవికుమార్, టాస్క్ ఫోర్స్ బృందం, మడికొండ పోలీసులు పాల్గొన్నారు.

## ఘనంగా సీత్లా భవాని పండుగ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ మండలంలోని పలు గ్రామాల్లో, తండాల్లో బంజారాలు మంగళవారం సీత్లా భవాని పండుగను ఘనంగా నిర్వహించారు. బంజారా సాంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. ఈ కార్యమానికి జడ్పీటీసీ తేజావత్ శారదా రవీందర్ హాజరయ్యారు. నవ ధాన్యాలతో గుగ్గిళ్ళు వండి గంగాజలంతో సీత్లా మాత వద్దకు బయలుదేరారు. డప్పు వాయిద్యాలతో నృత్యం చేస్తూ, బంజారా సాంప్రదాయంలో పాటలు పాడుతూ తలపై గుంగోటో(ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రం) ధరించి నైవేద్యం సమర్పించేందుకు తరలి వెళ్లారు. తమ పశువులు, వ్యవసాయం, పిల్లలు బాగుండాలని పూజలు చేశారు.

# మెరుగైన విద్యను అందించాలి

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**పలు పాఠశాలలు, పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు**





**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం పరిధిలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలతోపాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన అక్కడ అమలవుతున్న ఉన్నతి, నూతన విద్యా విధానం తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను, బోధన తీరును తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించిన ఆయన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. విద్యలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ ను కూడా కడియం శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..


రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలోని మందుల విభాగం, ఓపీ రిజిస్టర్, ల్యాబ్‌ను పరిశీలించి ఆసుపత్రిలో చేస్తున్న పరీక్షల గురించి ఆరా తీశారు. పాముకాటు, కుక్కకాటులకు అవసరమైన మందులు ఉన్నాయా లేదా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నా రు. పలువురు వైద్య సిబ్బంది డిప్యూటేషన్ లో ఉన్నందున వారి డిప్యూటేషన్ వెంటనే క్యాన్సల్ చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీఓ, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్ట్‌లో భూములు కోల్పోయిన వారిని ఆదుకుంటా..

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజకవర్గం పరిధిలోని ఖిలా వరంగల్ మండలం గుంటూరుపల్లి, గాడిపల్లి పరిధిలో మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హామీ ఇచ్చారు. తొలిదశలో విమానాల రాకపోకలకు వీలుగా భూమిని సేకరించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు, ఆయా గ్రామాల రైతులతో మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. గాడేపల్లిలో సుమారు 12 మంది ఇండ్లు కోల్పోతుండడంతో, వారి ఇండ్లను సందర్శించి ఇంటి యజమానులకు తగు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. భూములు కోల్పోతున్న అన్నదాతలు వరంగల్ పట్టణానికి చేరువలోనే ఉన్న గుంటూరు పల్లికి అతి సమీపంలోనే రహదారి పోయే విధంగా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# మొక్కలు నాటిన ఎమ్మెల్యే మురళి నాయక్

**వరంగల్ వాయిస్, మహబూబాద్ :** మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జామండ్లపల్లి ఆవరణలో ఉన్నటువంటి ఫారెస్ట్ ఎఫ్ఓ ఆఫీస్ ఆవరణలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఒక మొక్కను నాటి దానిని రక్షించాలన్నారు. ఈరోజు మీరు నాటే మొక్క రేపటి మానవాళికి రక్షణ కవచంగా మారుతుందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో యువత చురుకుగా పాల్గొని నేటి తరానికి ఆదర్శంగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ డిస్ట్రిక్ట్ ఎఫ్ఓ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్, పట్టణ నాయకులు, జిల్లా నాయకులు, జామల్లపల్లి వార్డు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏకశిల ప్రైమ్‌లో హరితహారం



**వరంగల్ వాయిస్, దామెర :** దామెరలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో హరితహారం ప్రోగ్రాం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నా, జీవావరణ సమతుల్యతను కాపాడాలన్నా పచ్చని చెట్లు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి దగ్గర ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇంచార్జ్ విజయ్ కుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లర్లకు పాల్పడితే చర్యలు: సీఐ హత్తిరాం నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఎవరైనా అల్లర్లు, గొడవలు, భూ తగాదలు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హత్తిరామ్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మరిపెడ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఎస్సైలు తహెర్ బాబా, సంతోష్ లు పాల్గొన్నారు.



## ప్రజలు గుణపాఠం చెప్పినా.. మోడీ వైఖరి మారలేదు

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి**

**వరంగల్ లో సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గత ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పినా మోడీ ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. వరంగల్ నగరంలోని కొత్తవాడలో సీపీఐ మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. తొలుత సీపీఐ పతాకాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతుల ప్రారంభ సభలో చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లనే లోక్ సభ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి భిన్నంగా పాలన జరిగిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను ఖూనీ చేశారని ఆరోపించారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేసి, అనేక మందిపై అక్రమ కేసులను బనాయించి జైలుకు పంపారని అన్నారు. రైతుల, కార్మికుల వ్యతిరేక చట్టాలు తెచ్చారని, ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారన్నారు. చివరకు తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలను కూడా అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు.

### సీపీఐది కీలక పాత్ర..

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపులో సీపీఐది కీలకపాత్ర అని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజాపాలన సాగించి ప్రజల సమస్యలు తీర్చాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు అందించాలన్నారు. కమ్యూనిస్టులకు ఉద్యమాలు, పోరాటాలే కర్తవ్యం అని, ప్రజల మధ్య ఉండి పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఎస్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, గుండె బద్రి, దామెర క్రిష్ణ, జన్ను రవి, వేల్పుల సారంగపాణి, తాళ్లపెల్లి రహేలా, ఎండి అష్రఫ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా తొలి రోజు శిక్షణ తరగతులలో మార్క్సిజం అంటే ఏమిటి అనే అంశంపై నేదునూరి రాజమౌళి, భారత రాజ్యాంగం-లౌకిక వాదం - ఆర్ఎస్ఎస్ ఎజెండా అనే అంశంపై డాక్టర్ మార్క శంకర్ నారాయణ బోధించారు.

# రైతు వేదిక సమాచార గీతిక

**మండలానికి ఓ రైతు వేదిక ఎంపిక**

**విడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతన్నకు సందేశాలు**



**వరంగల్ వాయిస్, దోర్నకల్ :** దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఎప్పటికప్పుడు అప్ టూ డేట్ కావటానికి వేదికగా రైతు వేదికలు అక్కరకొస్తున్నాయి. వ్యవసాయ సాగు, కాలం, నూతన టెక్నాలజీ, ప్రభుత్వం అందిస్తున్న పరికరాలతో పాటు అన్నదాతకు సలహాలు, సూచనల కోసం ప్రతి మండలంలో ఓ రైతు వేదికను ఎంపిక చేసారు. దృశ్య శ్రావణ (విడియో కాన్ఫరెన్స్) విధానంలో ఎల్సీడీ (టీవీ)లో వీక్షిస్తూ వ్యవసాయ అధికారుల, రైతుల సూచనలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన కేంద్రాల్లో రైతు నేస్తం పేరిట శిక్షణ అవగాహన కార్యక్రమాలను మార్చి 6న ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి మంగళవారం రైతు వేదికలో ఈ సమావేశం నిర్వహిస్తోంది. విత్తనం నుంచి మొదలుకొని పంటల సాగు వరకు జాగ్రత్తలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఆయా పంటల సాగులో ఆచరించాల్సిన నీరు, ఎరువులు తదితర యాజమాన్య పద్ధతులు, యాంత్రికరణ వివిధ పంటలకు ఆశించే చీడపీడలు వాటి నివారణ, సేంద్రియ వ్యవసాయ విధానాలు ఇలా పలు అంశాల్లో వారికి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, నిపుణులతో ఆయా పంట కాలాల్లో అవగాహన శిక్షణ అందిస్తున్నారు. అభ్యుదయ రైతుల అనుభవాలు సేంద్రియ సాగు విధానాలు ప్రసారం చేస్తున్నారు. రూ.23 లక్షల నిధులతో గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో ఎల్ఈడీ, వీడియో కెమెరాలు, స్టాండ్ సిస్టం తదితర సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ సెంటర్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చేసింది.

### క్లుప్తంగా సమాచారం :

**– అవినాష్, వ్యవసాయ విస్తరణ అధికారి**

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వర్షా కాలంలో సాగు చేసే పంటలు వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర మొదలైన పంటలు సాగు కలుపు యాజమాన్య పద్ధతుల గురించి క్లుప్తంగా రైతుకు తెలియజేస్తున్నాం. వర్షాకాలం సీజన్ లో స్వల్పకాలిక రకాలు సాగు వివరాలతో పాటు జగిత్యాల, సాంబ, బతుకమ్మ, తెలంగాణ సోనా రకాల వృద్ధి దిగుబడి ఇచ్చే పంటలు, తెగుళ్ల నివారణ గురించి శాస్త్రవేత్తలు రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. రైతులకు ఉన్న సందేహాలను తెలుసుకొని వారికి వివరణ ఇవ్వడం జరిగింది.

## కేయూ పాలక వర్గ సభ్యురాలిగా అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం పాలక వర్గ సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ అనితా రెడ్డితోపాటు మిగతా సభ్యులు మంగళవారం హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, విద్యా శాఖ సెక్రటరీ వెంకటేశం, ఇంచార్జి వీసీ వాకాటి కరుణను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకే బాటలు వేసే కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి అందరం కలిసి పనిచేస్తామని, సంభందిత అధికారులుగా సహకరించాలని డాక్టర్ అనిత రెడ్డి కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేస్తానన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉంటానని, సమస్యలు తమ దృష్టికి తీసుకొని రావచ్చునని చట్ట పరిధిలో తాను చేయగల ప్రతిదీ చేస్తానని డాక్టర్ అనిత రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు డాక్టర్ అనిత రెడ్డి, డాక్టర్ బి.సురేష్ లాల్, ప్రొఫెసర్ రమ, ప్రొఫెసర్ సుకుమారి, చిర్రరాజు, మల్లం నవీన్, పుల్లూరి సుధాకర్, సుదర్శన్, మూడ్ బాలుచౌహాన్, రిజిస్ట్రార్ మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్ వీరంగం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ కార్పొరేటర్ కానుగంటి శేఖర్ ఓ వ్యక్తి ని తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అదివారం మధ్యాహ్నం ములుగురోడ్డు నుంచి కానుగంటి శేఖర్ రాపిడో బుక్ చేసుకోగా ఖిలా వరంగల్ కు చెందిన రాపిడో బాయ్ సిద్దంశెట్టి కృష్ణంరాజు లోకేషన్ కు వచ్చాడు. దాదాపు 15 నిమిషాలు వేచిచూసిన శేఖర్ లోకేషన్ ప్రాంతం నుంచి బయలుదేరడానికి సిద్ధం కాకపోవడంతో రైడ్ క్యాన్సిల్ చేసుకోవాలని ర్యాపిడో బాయ్ అనడంతో కానుగంటి శేఖర్ నానా దుర్భాషలాడుతూ సిద్దంశెట్టి కృష్ణంరాజుపై చేయి చేసుకున్నాడు. శేఖర్ స్నేహితుడు రమణాచారి సైతం బాధితుడిపై దాడి చేయడంతో సిద్దంశెట్టి కృష్ణంరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో హనుమకొండ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసులు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

## యువత మత్తుకు బానిస కావద్దు




**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువత మత్తుకు బానిసలుగా మారవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు ఎన్నో కుటుంబాలు చిద్రం అవుతున్నాయన్నారు. ఆచార్య రవి రూపొందించిన వాల్ పోస్టర్లను మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.

# మార్క్ చూపిస్తా..

## అభివృద్ధి బాట పట్టిస్తా..






### మాస్టర్ ప్లాన్ అమలుకు కృషి

### కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి

### మారనున్న ఓరుగల్లు రూపు రేఖలు

కాంగ్రెస్ పార్టీలో ఆయన స్టార్ క్యాంపెనర్. సభ ఏదైనా, కార్యక్రమం ఎలాంటిదైనా ఆయనది స్పెషల్ అప్పీయరెన్స్. సామాన్యులకు కష్టం వస్తే నేనున్నానంటూ భరోసానిచ్చే మనసున్న మారాజు... ఆయనే కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి. దయార్ద్ర హృదయం కలిగిన ఆయన నిత్యం ప్రజలతో మమేకమవుతారు. ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు అనేక ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయపరంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు వెంకట్రాంరెడ్డి సంబంధాలు కొనసాగిస్తారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిబద్ధత చూపుతారు. రాజకీయాల్లో తలపండిన నేతలు, కాకలు తీరిన యూదులందరితో ఆయన చెలిమి చేస్తారు. నమ్మితే ప్రాణం ఇస్తారు. కనుక 'కూడా 'చైర్మన్ గా తన మార్కును తప్పక ప్రదర్శిస్తారు. కాకతీయుల గడ్డ ఆయన నేతృత్వంలో నిత్య నూతనంగా వెలుగొందుతుందటంలో ఎవరికి సందేహం అక్కరలేదు.

### మార్క్ చూపిస్తా...

హైదరాబాద్ స్థాయిలో వర నగరాభివృద్ధికి కృషి చేస్తానని, బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. 2024 జూలై 8 సోమవారం కుడా చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన వరంగల్ వాయిస్ ప్రతినిధితో మాట్లాడుతూ ఈ పదవి రావడానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ సుప్రీమ్ సోనియా గాంధీ, అగ్ర నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులకు వెంకట్రాంరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఓరుగల్లు నగర సమగ్రాభివృద్ధికి నిరంతరం పాటు పడతానన్నారు. నగరంలో చేపట్టిన వన మహోత్సవాన్ని విజయవంతం చేస్తానన్నారు. ప్రగతి, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించి వాటిని సకాలంలో పూర్తి చేయిస్తానన్నారు. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి అవసరమైన మేరకు ప్రక్షాళన చేసి, ప్రగతి బాటలు వేస్తానని వివరించారు. కుడా పాలన, నిర్వహణపై పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతానని, యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. వరంగల్ నగరానికి అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారుచేసి రాష్ట్ర ముఖ్యమంత్రికి నివేదిస్తానని తెలిపారు. ప్రభుత్వ హామీలైన ఆరు గ్యారెంటీల అమలుతో పాటు, ఔటర్ రింగ్ రోడ్, విమానాశ్రయం, జంక్షన్ ల అభివృద్ధి, ప్రధాన రహదారుల ఉన్నతీకరణ కోసం కృషి చేస్తానని, ముఖ్యంగా పారిశ్రామిక ప్రగతికి పాటుపడతానన్నారు. కాళోజి కళాక్షేత్రాన్ని పూర్తి చేయడంతోపాటు ఆదర్శ నగరంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు.

### ముంపు నివారణకు శాశ్వత చర్యలు..

భవిష్యత్తులో వరదలతో నగరానికి ముప్పు రాకుండా హైదరాబాద్ తరహాలో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు ఇనగాల వెంకటరామిరెడ్డి వెల్లడించారు. వర్షాకాలంలో నగరం ముంపునకు గురికాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలాల పూడికతీత, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం నిరంతరం సాగాలన్నారు. ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయాలని, మ్యాన్ హెూల్స్ మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని సూచించారు. త్వరలో అన్ని శాఖలను సమన్వయం చేసి నగరంలోని ప్రజానీకానికి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అలాగే కుడాలో పేరుకుపోయిన పెండింగ్ ఫిర్యాదులను దశలవారీగా పరిష్కరిస్తామని ఇనగల వెంకట్రాంరెడ్డి హామీ ఇచ్చారు.

### వన్నె తెస్తా..

కుడా పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్ ను తీసుకొచ్చి అమలుకు కృషి చేస్తానని ఇనగాల వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో అభివృద్ధి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో చైర్మన్ గిరికి వన్నెతెస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతల సహకారంతోపాటు, పరకాల నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తాను కుడా చైర్మన్ అయ్యానని ఇనగాల స్పష్టం చేశారు. జీవితకాలం ప్రజలతోనే ఉంటానని, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నగరానికి కొత్త ప్రాజెక్టులు, నిధులు తీసుకువచ్చి వరంగల్ మహా నగరాన్ని అన్ని విధాల తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సహకారంతో ఓరుగల్లు నగరం రూపు రేఖలు మార్చుతాను అన్నారు.









## ఇనగాలకు అభినందనల వెల్లువ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రాంరెడ్డికి అభినందనల వెల్లువెత్తాయి. కుడా కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుడా చైర్మన్ గా భాద్యతలు చేపట్టిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కుడా చైర్మన్గా భాద్యతలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గం ఇంచార్జి ఇనగాల వెంకట్రాంరెడ్డిని టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, రైతు బందు కమిటీ మాజీ జిల్లా కన్వీనర్ బొల్లె భిక్షపతి, పరకాల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పర్నెం తిరుపతి రెడ్డి, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దబ్బేట రమేష్, పుల్యాల గాంధీ, పెండెల కొమురయ్య, పసుల రమేష్, కొర్నేల్ తదితరులు కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కూడా అభివృద్ధికి పాటుపలడాలని కోరారు.















# వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

## దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు మంత్రి సీతక్క హామీ



**వరంగల్ వాయిస్, ములుగు :** దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు దేనిలో తక్కువ కాదని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు ఉపకరణాలు, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమాజంలో కొందరు పుట్టుకతో, మరికొందరు అనారోగ్యంతో, ఇంకొందరు ప్రమాద కారణంగా దివ్యాంగులుగా మారుతారని, అటువంటి వారికి ఆలంబన కలిగేలా సమాజం కూడా తోడ్పాటునివ్వాలని సూచించారు. అలాగే శరీరంలో వచ్చే వివిధ రకాలైన మార్పుల కారణంగా ట్రాన్స్ జెండర్లుగా మారుతారని, వారికి హక్కులు, ఆత్మ గౌరవం ఉంటుందని, సమాజంలో వారు గౌరవంతో జీవించేలా వారికి తోడ్పాటు అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఉపకరణాలు, ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఇట్టి సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన పొంది ఉన్నతంగా ఎదగాలని లబ్ధిదారులకు సూచించారు. వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 75 కోట్లు కేటాయించిందన్నారు.

### మహిళలకు పెద్దపీట..

ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పొరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో మహిళలకు పెద్ద పీట వేస్తుందని వారికి ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకం మొట్ట మొదటిసారిగా ములుగు ప్రాంతంలోనే ప్రారంభించడం జరుగుతుందని, స్థానిక మంత్రి ప్రజల కొరకు అహర్నిశలు కష్టపడుతుందని కొనియాడారు. అనంతరం దివ్యాంగులకు మూడు రెట్రో ఫిట్టేడ్ మోటార్ ద్విచక్రవాహనాలు, నాలుగు బ్యాటరీ వీల్ చైర్లు, ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు రూ.50 వేల విలువ కలిగిన రెండు చెక్కులను బలరాం నాయక్ తో కలిసి మంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనైన, మంత్రి ఓఎస్ డీ మధుసూదన్, జిల్లాలోని సీడీపీఓలు, డీసీపీఓ, డీసీపీయూ, సీహెచ్ఎల్, సఖి, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# మల్లికాంబలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

## కేక్ కట్ చేసి అన్నదానం, పండ్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీతక్క ఉద్యమ సహచరులు దంపతులు కంకణాల విజయ సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జన్మదిన వేడుకలకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బోల్లారపు సదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు అన్నదానం చేసి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ.. సీతక్క ఉద్యమ ప్రస్థానం రాజకీయ ప్రస్థానం ప్రజాసేవ తదితర అంశాలను మరోమారు వివరించారు. రానున్న రోజుల్లో సీతక్క మరిన్ని ఉన్నత స్థాయి శిఖరాలు అధిరోహించాలని, పేదల పక్షాన పోరాడుతూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు కంకణాల విజయ సంతోష్ దంపతులు మాట్లాడుతూ సీతక్క ఉద్యమ కాలం నుంచి ఇప్పటివరకు ఒకే రకమైన మనస్తత్వంతో లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. అనుక్షణం పేదల పక్షపాతిగా ఆలోచిస్తుందన్నారు. తను ఎన్ని పదవులు అధిరోహించినా నాటి నుంచి నేటి వరకు తనతో నడిచిన ఏ ఒక్కరిని మరిచిపోకుండా పేరుపేరునా గుర్తుంచుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆపద కాలంలో ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మంచి అవకాశాలు సీతక్కకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు సాయిరాం, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కొమ్మ కుమారస్వామి, అయినవోలు దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు జక్కుల రాజు యాదవ్, కుటుంబ సభ్యులు సీహెచ్.కృష్ణ ప్రసన్న, సృజన,,చిన్నారి తక్షి, కంకణాల శ్రీజిత, మానిని, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు రామలీల తదితరులు పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు తెలిపిన ఎంపి కావ్య..

నేటి రాజకీయాల్లో ఆణిముత్యం..జనం కోసమే అనునిత్యం నీ ఆరాటం..మీ పోరాటం మాకు ఆదర్శం..గిరిజనుల, ఆదివాసీల, పేద ప్రజల బాధలు తీర్చడానికి అహర్నిశలు శ్రమించే మీ సేవాగుణం స్ఫూర్తిదాయకం.. ప్రజలే సర్వస్వంగా భావించే మీరు నిండు నూరేళ్లు ఆనందంతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానంటూ వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

### బీసీ సంక్షేమ సంఘం నాయకులు..

మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా ములుగులోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ తదితరులు ఆమెకు పుష్ప గుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో బీసీల కులగణన చెప్పట్టి బీసీల జనాభా దమాషా ప్రకారం స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు.

# ఏవీవీలో నోట్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీ వాసవి విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు వెయ్యి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి విద్యా సేవా సమితి అధ్యక్షులు శ్రీరాం భిక్షపతి మాట్లాడుతూ నగరంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఈ విద్యా సంస్థలో విద్యార్థులకు సేవ చేసే అవకాశం లభించడం తమ భాగ్యమన్నారు. కార్యదర్శి గుముడవెల్లి సత్యనారాయణ రావు మాట్గాడుతూ ఇట్టి నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గత విద్యా సంవత్సరం నుంచి ప్రతీ రోజూ ఒక్కో విద్యార్థికి ఒక అరటిపండును అందచేస్తున్న గుముడవెల్లి సత్యనారాయణ రావుకు పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ధన్యవాదాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, సంఘ సభ్యులు, ఏవీవీ ఆలుమ్ని అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.భుజేందర్ రెడ్డి, శ్రీ వాసవి విద్యా సేవా సమితి కోశాధికారి శ్రీరాం సతీష్, సభ్యులు నాగళ్ల సతీష్, కల్లూరి వెంకటరాంనర్సయ్య, అయితా మోహన్, రేణుకుంట్ల కుమారస్వామి, దివ్వెల పూర్ణచందర్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# 12 నెలలగా బిల్లులు రావడం లేదు

## డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట అద్దె వాహనాల యజమానుల నిరసన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో డీఎంహెచ్ఓతోపాటు ఇతర అధికారులకు అద్దెపై వాహనాలు పెట్టిన వారికి గత 12 నెలలుగా బిల్లులు రావడం లేదని ఆరోపిస్తూ మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బిల్లులు రాకపోవడంతో కుటుం పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పిల్లల బడి ఫీజులు కట్టడం కష్టంగా మారిందన్నారు. ఈఎంఐ కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వారికి రావాల్సిన పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండకు చెందిన డ్రైవర్లు మహేందర్, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనుల వేలం పాటలను రద్దు చేయాలి

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాష్ట్రంలో బొగ్గు గనుల వేలం పాటలను రద్దు చేసి సింగరేణి కాలరీస్ కి వాటిని కేటాయించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 130 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి మన రాష్ట్రానికి గుండెకాయలాంటిదన్నారు. ఎన్నికల ముందు పర్యటనలో ప్రధానమంత్రి బొగ్గు గనులను ప్రైవేటీకరించే ప్రసక్తేలేదని చెప్పి ఇప్పుడు వేలం వేయడం ఏమిటన్నారు. కేంద్ర మంత్రివర్గంలో బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ప్రధానమంత్రిని ఒప్పించి బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలన్నారు. లేకుంటే తెలంగాణ ప్రజలు క్షమించరన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి తగిన నిర్ణయం తీసుకోకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని వెంకట్రాములు హెచ్చరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL. TELANGANA STATE. NEWS NETWORK INCHARGE : SAMALA SURYAPRAKASH, CELL: 9849943339
RNI : TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com